కథ

# చేజారిన ఛాన్స్

## యస్.వివేకానంద

'పటాటోపం' వీక్లీ ఆషామాషీపత్రికేం కాదు. పాతికేళ్ల చరిత్ర వుందీ. లక్షల్లో సర్క్యులేషనుంది. పాఠకుల్లో మోజుందీ.... క్రేజుంది!

వారం తిరక్కముందే సంచిక మార్కెట్లోకి ఎప్పుడొస్తుందాని పాఠకదేవుళ్లు వళ్లంతా కళ్లు చేసుకు నిరీక్షిస్తూంటారు. అదీ ఆ పత్రికకున్న గ్రేస్!... గ్రేట్నెస్!!

ఎంతో కీర్తి ప్రతిష్ఠలను ఆర్జించిన నేటి మేటి వారపత్రికది! ఆ వీక్లీలో జీవితకాలంలో ఒక్కకథైనా అచ్చయితే చాలు జీవితం చరితార్థమౌతుందనుకునే రచయితలు కోకొల్లలు.

దాని ఆఫీసు అత్యంత సుందర భవనం!... కాదు. కాదు అదొక అద్దాలమేడ! అందులో పని చేసేవారికి తప్ప ఇతరులెవ్వరికీ ప్రవేశం లేదు. ట్రెస్‌పాసర్స్ కఠినంగ శిక్షించ బడతారనే బోర్డు భయపెడుతూ వుంటుంది. అదొక నిషిద్ధ ప్రదేశం!

చీఫ్ ఎడిటరు ..... అసోసియేట్ ఎడిటరు ... ....డిప్యూటీ ఎడిటర్.... అసిస్టెంట్ ఎడిటర్....ఫీచర్స్ ఎడిటరు.... ఇంకా ఎన్నో కేట గిరీల సంపాదకులు అక్కడ పనిచేస్తున్నారు.

పత్రికను నిత్యనూతనంగా తీర్చిదిద్దటానికి అహర్నిశం వారంతా పాటుపడుతూంటారు. సమర్థత గలవారికి మాత్రమే అక్కడ చోటు!

రచయిత (త్రు)లెవరూ ఎడిటోరియల్ సిబ్బందిని కలిసే వీలుండదు. ఫోన్లో మాట్లాడాలన్నా కనెక్షన్ ఇవ్వరు. సెక్యూరిటీ విజిలెన్స్ స్ట్రిక్ట్‌గ వుంటుంది.

ప్రచురణకు అంగీకరించిన రచనకు పారి తోషికం నాలుగు అంకెల్లో వుంటుంది. సాధారణ ప్రచురణకు స్వీకరింపబడాలంటేనే తాతలు దిగొ స్తారు. ఇక పోటీల్లో ప్రైజు కొట్టటమంటే ఎంత 'త్రిల్లో' మాటల్లో చెప్పటం అసాధ్యం. కౌన్ బనేగ కరోర్‌పతీలో విన్నింగ్ ఛాన్స్ కొట్టినట్టే!

పోటీల్లో పాల్గొనే వారంతా వీరగంధం పూసు కుని..... శ్రీరామచంద్రుడు శివధనుర్భంగంలో శ్రమించినంతగ కష్టపడాల్సి వుంటుంది. ప్రైజులు తన్నుకుపోవాలంటే క్రితం జన్మలో పుణ్యం చేసుకుని పుట్టినవారై వుండాలి!

వీరాధివీరులు..... శూరాధిశూరులు.... కత్తు ల్లాంటి కలాలు దూసి పోటీకి తలపడతారు. అలాంటిది.... సీదాసాదా రైటర్స్ సంగతి చెప్పనే అక్కర్లేదు. విజయానికి ఆమడదూరంలో చతికిల బడతారంతే!

పటాటోపం వీక్లీ ఆఫీసులో స్టోరీ సెక్షన్ సంపాదకుడు మార్జాలరావ్! పత్రిక పుట్టిననాటినుండి ఎఫిషియంట్ కావున అదే సీట్లో వున్న ఘనుడు! కథలు చదివిసెలక్ట్ చేయటమంటే అతనికి లెఖ్ఖలోని విషయంగాదు.

మార్జాలరావ్ ఆల్మోస్ట్ ఓ అజ్ఞాతవ్యక్తి! అతను ఎలావుంటాడో.... రూపురేఖలేమిటో చాలామందికి తెలీదు. రచయితల కంటపడితే ఎక్కడ పీక్కు తింటారో.... లేక బలవంతంగ ఏ బార్‌కో లాక్కెడ తారోనని భయం మూలాన ముసుగువీరుడిలా బైట తిరుగుతూంటాడేమో తెలీని విషయం.

ఇన్నేళ్లుగా పత్రికాఫీసు కొచ్చే వందలాది కథలు చదివి చదివీ మతిభ్రమించి...కొన్నాళ్లు వైజాగ్ పిచ్చాసుపత్రిలో షాక్ ట్రీట్‌మెంట్ పొంది.... పెళ్లాం తాళి గట్టిదవటం వల్ల డిశ్చార్జై క్షేమంగ ఇల్లు చేరు కున్నాడు.

మార్జాలరావ్‌లో ఓ ప్రత్యేకత వుంది! అదేమిటన...? కవరులో వుండే కథ చదవకపోయినా దాని నాడి పరీక్షించి కథలో ఎంత పస వుందో.... అచ్చుకు నోచుకుంటుందో లేదోని.... కథ జాతకం చెప్పెయ్యగలడు! అది అతనిలో వున్న టేలెంట్!. ఆకారణంగానే ఆ పత్రికాఫీసులో ఫెవికాల్ లాగ అతుక్కుపోయాడు.

చేతికొచ్చిన ప్రతి కథా 'లైన్-టు-లైన్' శ్రద్ధగా చదవగల ఓర్పుంది. ఓపెనింగ్ పేరా చదివో... ముగింపు చదివో... టైటిల్ చూసో... రచయిత పేరు బాగుందనో కథలు సెలక్ట్ చేసే అలవాటు మార్జాలరావ్‌కి లేదు. మనిషి సిన్సియర్ అండ్ ఆనెస్ట్!

అతనంటే కథలకీ హడలే! పేరుకే మార్జాల రావ్ గాని వుద్యోగం చేయటంలో మహిషానికి తీసిపోడు!

చేతికొచ్చిన ప్రతి కథా విలవిల్లాడి పోవా ల్సిందే! తనను సెలక్ట్ చేయమని అర్థిస్తుంది! దీనాతి దీనంగా వేడుకుంటుంది. కంట తడిపెడుతుంది. చెత్తబుట్ట పాలు చేయవద్దని వేడుకుంటుంది.

అయినా జాలిచూపని పాషాణహృదయం మార్జాలరావ్‌ది!

గ్రేటర్ హైదరా బాద్‌లో చేయి తిరిగిన కథా చక్రవర్తి శునకేశ్వరావ్.

అదేం పేరని కొత్తల్లో అందరూ ఆశ్చర్య పోగా.... తన మీద తానే ఓ కథ రాసేసుకుని.... పేరెంట్స్ తనకు అలాంటి ప్రత్యేకమైన పేరు పెట్టటంలో గల రహస్యం చెప్పుకున్నాడు.

శతాధిక గ్రంథకర్త శునకేశ్వరావ్!... కథా చక్రవర్తి...నవలా సామ్రాట్.. ఇత్యాది బిరుదులున్న ఘనాపాటి. ఒకట్రెండు విశ్వ విద్యాలయాలు అతగాడికి గౌరవ డాక్టరేటిచ్చి గౌర వించిన చరిత్ర వుంది.

శునకేశ్వరావ్ రచనలకు మంచి ఫాలోయింగ్ వుంది. వేల సంఖ్యలో ఫేన్లూ వున్నారు. జిల్లా స్థాయిలో అభిమానసంఘాలున్న వ్యక్తి!

పత్రికలు అతగాడికి లెటర్స్ రాసి మరీ కథలు నవలలు తెప్పించుకుని అచ్చేస్తయ్. అంత సత్తా వున్న మనిషి!

ఏ పత్రికకు ఎంత సర్క్యులేషనుంది?.... ఎంత రెమ్యూనరేషన్ ఇస్తుంది? అనే ప్రశ్నల జోలికి పోడు.

కొత్తగా పత్రిక ప్రారంభిస్తున్నామంటూ కథ కోసం లెటర్ ఎవరైనా రాసిందే తడవు.... రపీమని ఓ కథ పంపటం అతని అలవాటు.

కేంద్ర రాష్ట్ర సాహిత్య ఎకాడమీలు ఆయన నవలకు కథాసంపుటాలకు బహుమతులు ప్రసాదించి నయ్.

అయినా మనిషిలో కించిత్ గర్వం లేదు. అరవై దాటిన అందగాడు.

ఆయన రచన అచ్చుకాని పత్రికంటూ లేదు ఆంధ్రదేశంలో.... ఒక్క పటాటోపం వీక్లీ తప్ప!

రాని బహుమతి అంటూ లేదు.... ఒక్క పటాటోపం నిర్వహించే వివిధ రకాల పోటీలు తప్పించి.

శునకేశ్వర్రావ్ వర్రీ అంతా ఒక్క 'పటాటోపం' పత్రిక గురించే! ఆ వీక్లీలో తన రచనలు ఎందుకు అచ్చుకు నోచుకోవు? అనేదే ఆయన ప్రశ్న... కాదు దిగులు!

రచనా రంగంలో నలభైయ్యేళ్ల అనుభవం తనది! అయినా ఆ ఒక్క పత్రిక విషయంలో ఫెయి లవుతూ వస్తూండటం ఓ పెద్ద వర్రీగా తయారైంది. అవమానభారంతో కుంగిపోక తప్పటం లేదు.

అభిమానసంఘాలవారు.... పాఠకులు అతని శిలావిగ్రహాన్ని టాంక్‌బండ మీద ప్రతిష్ఠ చేస్తామని బలవంతం చేసినా.... బ్రతికి వుండగా దేనికని ససేమిరా అన్నాడు.

అలనాడు మయసభలో సుయోధనుడికి జరిగిన అవమానం కంటే వేయిరెట్లు ఎక్కువైె తన రచన 'పటాటోపం' వీక్లీలో అచ్చు కాకపోవటంతో తల తీసేసినట్టుంది శునకేశ్వర్రావ్‌కి!

మంచి హ్యూమరున్నవాడు. ఎప్పటికైనా 'పటాటోపం' పత్రికలో తన కీర్తి పతాక ఎగుర వేయా లనేదే అతని పట్టుదల.

ఏం సార్... ఈమధ్య కన్పించటం లేదని ఎవరైనా ప్రశ్నిస్తే... కన్పించనిది తనా?.... పత్రికల్లో తన రచనలని హాస్యపూరిత ధోరణిలో జవాబిచ్చే చతురుడు.

శునకేశ్వర్రావ్ చిరకాలమిత్రుడు వామనరావ్ వీధిలో ఎదురై 'ఏమోయ్!.... నీ కథలు 'పటాటోపం' పత్రికలో అచ్చవుతున్న దాఖలాలెక్కడా కన్పించటం లేదే?....' పలుకరించాడు.

ఆ పలుకరింపు చమత్కారమో... ఎద్దేవో.... పరిహాసమో... దెప్పిపొడుపో గ్రహించలేనంత అమాయకుడేం కాదు తాను.

'ఏం చెప్పను? అదొక 'సాడ్ స్టోరీ' తల దించుకున్నాడు సీనియర్ సిటిజన్ శునకేశ్వర్రావ్.

★ ❋ ★

'నీ అంతటి వ్యక్తి నిరుత్సాహంతో నీరుకారి పోతగునా?' ముక్కునవేలేసుకున్నాడు వామనమూర్తి.

'ఏమిటీ...... చాలా రోజులకు దర్శన మిచ్చావ్?..' టాపిక్ మారుస్తూ ప్రశ్నించాడు.

'నిన్ను కలుద్దామనే బయల్దేరాను. వెతక బోయిన తీగ కాళ్లకు చుట్టుకున్నట్టు.... నీ దర్శనం మార్గమధ్యంలోనే అయింది.....'

'ఏమిటి విశేషం?'

'నీ రెండో కొడుకు మోహన్ లేడూ.... అదే నోయ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు..... వాడికో మాంచి సంబంధం వెతికాను....'

ఇద్దరూ దగ్గర్లో వున్న పార్క్‌లోకి నడిచి ఓ మూల సిమెంట్ బెంచీ మీద కూర్చున్నారు.

'నేను చెప్పబోతున్నది కూడా..... నీ స్థాయికి తగిన సంబంధమే....'

'సస్పెన్స్ దేనికీ? విషయానికిరా....'

'ఈమేచ్ సెటిలైతే నాకేమిస్తావ్?'

'బ్రోకరేజా?'

'చాల్లే నీ పరిహాసం! పిల్లతండ్రి ఎవరో కాదు..... 'పటాటోపం' పత్రికాఫీసులో ఎడిటర్ మార్జాలరావ్.....'

'ఆగాగు.... ఏమన్నావ్? మార్జాలరావా? పత్రిక ఆఫీసులో ఎడిటరా?..... మరైతే మార్జాలానికి శునకానికీ బద్ధవైరం కదా? –' జోకేడు శునకేశ్వ ర్రావ్.

'అన్నీ కుదిరేట్టు చేస్తాను. సరేనా! మంచి సాంప్రదాయం కల కుటుంబం వాళ్లది. అతని కూతురు చక్కని చుక్క!'

శునకేశ్వర్రావ్ మనసు ఎగిరి గంతేసింది. తన రొట్టె విరిగి నేతిలో పడబోతోందన్నమాట! పైకిమాత్రం తొణక్కుండ గంభీరంగ ఫోజుపెట్టాడు.

★ ❋ ★

జాతకాలు కుదిరాయి కాబట్టి పెళ్లి చూపుల తంతు ఏర్పాటు చేయించాడు వామనమూర్తి.

మార్జాలరావ్ ఇంటికి తరలివెళ్లింది శునకేశ్వర్రావ్ ఫామిలీ!

'అయ్యా.... నాకు నలుగురూ ఆడపిల్లలే! ఈ అమ్మాయి మూడవది దీనికి వంటవార్పు వచ్చు. కంప్యూటర్ కోర్సు చెప్పించాను. మీరు కావాలను కుంటే వుద్యోగం చేయించుకోవచ్చు!.... నా సంపా దన తప్పించి ఆస్తిపాస్తులేమీ లేవు.....'

పిల్ల తండ్రి మాటకి అడ్డొస్తూ 'కథ మీరు చెప్పద్దు. పాయింట్ చెప్పండి చాలు! కథనెలా రాయాలో.... సారీ... నడిపించాలో నే చూసు కుంటాను.....' మాట్లాడేడు శునకేశ్వర్రావ్.

'బావగారు చతురులే! నేను మీ అంత గొప్ప వాడిని కాదు. పిల్ల నచ్చితే మీ నిర్ణయం చెప్పండి. కట్నకానుకలు ఇచ్చుకోలేకపోయినా..... పెళ్లి మీ స్థాయికి తగ్గకుండా చేస్తాను.'

ఇంతలో వామనమూర్తి జోక్యం చేసుకుంటూ 'ఇక్కడో తిరకాసుంది – అదేమిటంటే?.... మీ అమ్మాయి వారి అబ్బాయికి నచ్చి సంబంధం ఖాయమైతే....'

'ఆఁ! అయితే....' నోరు తెరిచాడు మార్జాల రావ్.



**19-4-2009** న విజయవాడలో ప్రజాసాహితీ వేదిక ఆధ్వర్యాన జరిగిన 'మాయని దర్వాజా' ఆవిష్కరణ సభలో ఆవిష్కర్త, ప్రముఖ కవి, కథా రచయిత పాపినేని శివశంకర్, పుస్తక రచయిత చైతన్యప్రకాష్, సభాధ్యక్షుడు–వేదిక కన్వీనర్ ఆంజనేయ కుమార్, కరుణకుమార, కథాసాహిత్యాన్ని పరిచయం చేసిన ప్రముఖ కథారచయిత్రి శ్రీమతి పి.సత్యవతి చిత్రంలో వున్నారు.

'ఏం లేదు. కట్నం మావాడు ససేమిరా పుచ్చుకోడు... కాకపోతే....'

ఆ గొంతెమ్మ కోరికేమిటో చెప్పరూ అనే భావనతో వామనమూర్తి కేసి చూశాడు మార్జాలరావ్.

'మావాడు మీ పత్రికకు పంపే ఏ రచనా తిరిగి వెనక్కు రాకుండా చూచుకోవలసిన బాధ్యత మీది! వీలైనన్ని ఎక్కువ కథలు మీ పత్రికలో చోటు చేసుకోవాలి! అలా అని మీరు మాటివ్వాలి....'

వామనమూర్తి మాటలు విన్న మార్జాలరావ్ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా అయింది. నో అంటే సంబంధం బెడిసికొడుతుంది. ఎస్సంటే.... తన ప్రిన్స్‌పుల్స్‌కే ఎసరొస్తుంది.

కాసేపు మధనపడి 'సరే కానివ్వండి. మేము ఆడపెళ్లివారం కదా?! - మగపెళ్లివారేమడిగినా కాదనకూడదు..... మంచిరోజు చూచి తాంబూలాలు పుచ్చేసుకుందాం! ఏమంటారు శునకేశ్వర్రావ్ బావ గారూ...?' మనసులో నిర్ణయాన్ని మెల్లగా బైట పెట్టాడు మార్జాలరావ్.

కాబోయే వియ్యంకుడి నిర్ణయం విన్న శునకేశ్వ ర్రావ్ సంబరపడి చంకలు గుద్దుకున్నాడు.

మేరేజ్ హాల్లో కూతురు వివాహం శోభాయ మానంగ జరిపించాడు మార్జాలరావ్.

ఆలస్యం అమృతం విషం అనుకున్న శునకేశ్వర్రావ్. లేటెస్ట్‌గా రాసిన వేయి పేజీల నవల...... ఫెయిర్ చేసి వుంచిన రెండు కథలు 'పటాటోపం' వీక్లీకి కొరియర్ ద్వారా పంపేడు. తాను వాటిని పంపిన సంగతి వియ్యంకుడు మార్జాలరావ్‌కి ఫోన్ చేసి చెప్పాడు.

పబ్లిష్ చేయక ఎక్కడికి పోతాడు?....ఆడపిల్ల తండ్రిగా కాదన్లేడు. పైగా పెళ్లికి ముందు కమిట్ కూడా అయినాడు.

అందుకే అవి పబ్లిష్ అవటం ఖాయం అనుకుని ధైర్యంగా వున్నాడు శునకేశ్వర్రావ్.

ఒక రోజున కూతురు కాపురం ఎలా వుందో చూచిపోదామని శునకేశ్వర్రావ్ ఇంటికొచ్చాడు మార్జాలరావ్.కాఫీ ఫలహారాల కార్యక్రమం ముగి శాక.... తాను పంపిన రెండు కథలు.... పెద్ద నవల సంగతేం చేశారంటూ ప్రశ్నించాడు.

అందుకాయన అదోలా నవ్వి 'మీకు తెలీదా బావగారూ... క్రితం వారంలో నేను సూపర్ ఏన్యు వేషన్ మీద రిటైరైనాను. ఇక నాకు పత్రికాఫీసుకు ఎలాంటి సంబంధ బాంధవ్యాలూ లేవు. సారీ.... మీకోరిక మన్నించగల అవకాశం లేకపోయింది. మరోలా భావించకండి.....' అసలు విషయం వెళ్ల గక్కేడు మార్జాలరావ్.

ఆ మాట విన్న శునకేశ్వర్రావ్‌కి గుండె ఆగినంత పనైంది. ఇలా జరిగిందేమిటి చెప్మా అను కుని బాధపడ్డాడు. రిటైర్మెంట్ సంగతి ముందుగా తనకు తెలిసివుంటే తానా రచనలు పంపి వుండేవాడే కాదన్పించింది.

బంగారంలాంటి అవకాశం చేజారిపోయి నందుకు మనసు చిన్నపుచ్చుకున్నాడు శునకేశ్వర్రావ్.



*తేది 27-3-2009న నల్లగొండలోని చినవెంకటరెడ్డి ఫంక్షన్ హాల్‌లో కవి, జర్నలిస్ట్ 'పున్నమి' రచించిన రన్నింగ్ కామెంటరీని ఆవిష్కరిస్తున్న ప్రముఖ కార్టూనిస్ట్ శంకర్*

## నానీలు

**ఝాన్సీ కె.వి.కుమారి**

యుద్ధరంగంలో
రాణుల్ని చూడలేదా?
సిటీబస్సుల్లో
లేడి కండక్టర్లని చూడు !

మేఘాలు
ముత్యాలు చల్లాయి
మట్టి
పరిమళాలను పండించింది

సత్యాన్ని స్వీకరించవా?
సరే....
అబద్ధాలకు మాత్రం
తండ్రివి కాకు !

అధికమైన మాటలు
దోషపు బాటలు
మూసిన పెదవులు
జ్ఞాననేత్రాలు

క్రీస్తు పలికిన
ప్రతి అక్షరం
ప్రేమత్యాగాల
సుగంధ పరిమళం!

పగద్వేషం
కలహజ్వలనం
ప్రేమ క్షమ
త్యాగానికాహ్వానం!

నిద్రతో చెలిమి
లేమికి బలిమి
సోమరితనం
దారిద్ర్యానికి రాచమార్గం !

క్షణాల ముళ్ళపై
జీవన సమరం
టెన్షన్ డిప్రెషన్
మిగిలిన ప్రతిఫలం !

వంటగదీ
ఎంతపని చేశావ్?
వనితల కాలాన్ని
నమిలి మింగేశావ్ !

యేసయ్య మాట
చావుకు తూట
లాజరుకు
పునరుత్థాన బాట !